సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



సుపారి ఇచ్చే చంపారు

భూ తగాదా వ్యవహారంలోనే తన భర్తను కారుతో ఢీకొట్టి హత మార్చారని కల్వకోల్‌కు చెందిన కమల ఆరోపించారు. 8లో▸



బీఆర్‌ఎస్ శ్రేణులో జోష్

మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిల పర్యటన బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. 8లో▸



రైలు ఢీకొని మేకల మృతి

రైలు ఢీకొని మేకలు మృతి చెందిన ఘటన గురువారం సోలీపూర్ శివారులో చోటు చేసుకుంది. 8లో▸

‘ఫ్యూచర్’కు ఫెన్సింగ్

- ఫార్మా భూ బాధిత గ్రామాల్లో మోహరించిన పోలీసులు
- సర్వే చేసి కంచె ఏర్పాటు పనులు చేపట్టిన అధికారులు
- అడ్డుకునేందుకు యత్నించిన రైతులను స్టేషన్‌కు తరలించిన సిబ్బంది



ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

యాచారం: పోలీస్ బందోబస్తు నడుమ ఫార్మాసిటీకి సేకరించిన భూములను గురువారం అధికారులు సర్వే చేసి చుట్టూ ఫెన్సింగ్ వేసే పనులు ప్రారంభించారు. గత బీఆర్‌ఎస్ హయాంలో మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీ కోసం 7,640 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించారు. అప్పట్లో సేకరించిన కొన్ని సర్వే నంబర్లల్లోని భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి మిగిలిన భూములు వదిలేశారు. పరిహారం పొంది ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులు ఆ భూములకు ఫెన్సింగ్ లేకపోవడంతో నాలుగేళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నారు. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లోనే ప్రస్తుత ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి పూనుకొంది. ప్రముఖ సంస్థలకు భూములు అప్పగించే సమయంలో రైతులు కబ్జాలో ఉంటే కష్టతరమని భావించిన ప్రభుత్వం యాచారం తహసీల్దార్ అయ్యప్ప, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు ఆధ్వర్యంలో భూములను సర్వే చేసి ఫెన్సింగ్ వేసే పనులను ప్రారంభించారు. రైతులు ఆందోళన చేస్తారని ముందు జాగ్రత్తగా రాచకొండ సీపీ సుధీర్‌బాబు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

గ్రామాల చుట్టూ పోలీస్ పహారా

నక్కర్తమేడిపల్లి గ్రామాన్ని పోలీసులు ఉదయమే తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, మరో ఇద్దరు ఏసీపీలు, ఎనిమిది మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 150 మందికి పైగా పోలీస్ సిబ్బంది, 40 మందికి పైగా టీజీఐఐసీ, రెవెన్యూ, సర్వే సిబ్బంది, 20కి పైగా జేసీబీలు, ఇతర యంత్రాలు, 50 మందికి పైగా కూలీలు సర్వే చేసే భూమి వద్దకు చేరుకున్నారు. అధికారులు సర్వే పనులు ప్రారంభించిన వెంటనే రైతులు అడ్డుకునేందుకు యత్నించారు. తమ అంగీకారం లేకుండానే పరిహారం డబ్బులు అథారిటీలో జమ చేశారు. కోర్టులో కేసులుండగా సర్వే చేయడం, ఫెన్సింగ్ వేయడం సరికాదని పనులకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేయగా వారిని పోలీసులు గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌కు తరలించారు. అనంతరం మాజీ సర్పంచ్‌లు పాశ్ఛ బాషా, శ్రీనివాస్‌రెడ్డి, మొరుగు రమేష్ తదితరులు తీవ్ర గందరగోళం సృష్టించడంతో వారిని సైతం అడ్డుకున్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడం, రైతులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నక్కర్తమేడిపల్లి గ్రామంలోని సర్వే పనులను అడ్డుకోవడానికి నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల నుంచి రైతులు తరలిరాకుండా నక్కర్తమేడిపల్లి–నానకనగర్, నక్కర్తమేడిపల్లి–సరికొండ రోడ్లపై పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.



ఫెన్సింగ్ పనులను పరిశీలిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి

ప్లాట్లకు కబ్జాలు చూపండి

ఫార్మాసిటీకి సేకరించిన భూములకు పరిహారం ఇచ్చారు. ప్లాట్ల పంపిణీ చేసి కబ్జాలు చూపేవరకు సర్వే, ఫెన్సింగ్ పనులు ఆపాలని రైతులు ఆందోళన చేపట్టారు. కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ ఇందుకు హామీ ఇవ్వాలని రైతులు పట్టుబట్టారు. ఆర్డీఓ అనంత్‌రెడ్డి ఘటన స్థలానికి రాగానే రైతులు చుట్టుముట్టారు. మూడేళ్ల కింద ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చి నేటికి స్థలం చూపించలేదు. ఫెన్సింగ్ వేసి మోసం చేస్తారా.. అంటూ నిలదీశారు. ఫార్మా ప్లాట్లకు లాటరీలు తీసి రిజిస్ట్రేషన్లు చేసి కబ్జాలు చూపిస్తామని హామీ ఇచ్చారు. కోర్టులో కేసులున్న భూములకు సర్వే చేసి, ఫెన్సింగ్ వేయమని హామీ ఇచ్చారు.

ఆ తర్వాత అంతా నిశబ్దం

ఆర్డీఓ అనంత్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు రైతులతో మాట్లాడుతూ వారికి నచ్చజెప్పుతున్న సమయంలోనే ఫార్మాకు సేకరించిన భూముల చుట్టు సర్వే, ఫెన్సింగ్ పనులను ముమ్మరంగా చేపట్టారు. రైతులను అటుగా వెళ్లనీయకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కొందరు రైతులు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డికి, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డికి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఫిర్యాదులు చేశారు. కోర్టు కేసులున్న భూములు, రైతుల వద్దకు వెళ్లవద్దని, పరిహారం పొందిన భూములనే సర్వే చేసి ఫెన్సింగ్ వేయాలని అధికారులకు సూచించారు. మధ్యాహ్నం వరకే రైతులు ఆందోళనలు, ధర్నాలు చేపట్టి ఆ తర్వాత అటువైపు వెళ్లలేదు. దీంతో అధికారులు సాయంత్రం 6 గంటల వరకు సర్వే చేసి ఫెన్సింగ్ పనులు చేపట్టారు.



పీఎస్ వద్ద ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు

జీవన్‌రెడ్డి కేసు.. రోజుకో మలుపు

- మరోసారి విచారణకు హాజరైన ఆర్మూరు మాజీ ఎమ్మెల్యే
- విషయం తెలుసుకుని ఠాణాకు తరలివచ్చిన బాధితులు
- తమ ప్లాట్లు వదిలేయలంటూ వేడుకోలు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని టంగుటూర్‌లో భూమి కొనుగోలు చేసిన ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. మండల పరిధిలోని టంగుటూర్‌లో సామ దామోదర్‌రెడ్డి కుటుంబీకులు, సన్నిహితులకు సంబంధించి 170 ఎకరాల భూమి ఉంది. 2006లో కొంత భూమిని చైతన్య రిసార్ట్స్ పేరుతో ప్లాట్లు చేసి, 2011 వరకు సుమారు 70 మంది వ్యక్తులకు వేయి గజాలు, 500 గజాల చొప్పున ప్లాట్లను విక్రయించారు. 2016లో అప్పటి ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డితో కొంపల్లిలో కొంత స్థలానికి గాను టంగుటూర్‌లో 114 ఎకరాలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. దీని ప్రకారం.. 2016లో సామ దామోదర్‌రెడ్డి 114 ఎకరాలను జీవన్‌రెడ్డితో పాటు ఆయన తల్లి రాజుబాయి, భార్య రజిత పేర్లపై చేశారు. ఒప్పందం ప్రకారం జీవన్‌రెడ్డి కొంపల్లిలో స్థలం ఇవ్వకపోగా.. ఇక్కడ ఉన్న 170ఎకరాలను, గతంలో ప్లాట్లు కొన్నవారి స్థలాలను సైతం కబ్జా చేసి గోడలు నిర్మించారు. ప్లాట్ల యాజమానులు సామ దామోదర్‌రెడ్డిని నిలదీయండంతో ఆయన తన భూమితో పాటు, గతంలో ప్లాట్లు చేసిన స్థలాలను ఆక్రమిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం మోకిల సీఐ వీరబాబు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని స్టేషన్‌లో విచారించారు.

పొంతనలేని సమాధానాలు

కేసు విచారణలో భాగంగా మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పోలీసులకు సహకరించడం లేదని సమాచారం. సామ దామోదర్‌రెడ్డి ఎలా పరిచయం? ఎక్కడ కలుసుకున్నారు? ఏమని ఒప్పందం చేసుకున్నారు? రిజిస్ట్రేషన్ ఎప్పుడు చేసుకున్నారు? పొజిషన్ ఎప్పుడు తీసుకున్నారు? డాక్యుమెంట్లు ఎందుకు లాక్కున్నారు? గోడలు ఎందుకు నిర్మించారు? ప్రైవేటు సెక్యూరిటీని ఎందుకు నియమించారు? గతంలో అక్కడ ప్లాట్లు ఉన్న విషయం మీకు తెలియదా? అంటూ సీఐ వీరబాబు ప్రశ్నించగా.. జీవన్‌రెడ్డి పొంతలేని సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. విచారణ సమయంలో డీజీ, సీపీ, డీసీపీలకు ఫోన్లు చేస్తూ, పోలీసులు హింసిస్తున్నారు అని చెప్పినట్లు సమాచారం.

మా ప్లాట్లు మాకు ఇవ్వండి



పైసా పైసా కూడబెట్టుకుని చైతన్య రిసార్ట్స్‌లో 2006లో వేయి గజాల స్థలం కొన్నా. 2021వరకు మా ఆధీనంలోనే ఉంది. తర్వాత కొంతమంది ప్రైవేటు వ్యక్తులు వచ్చి గోడలు నిర్మించారు. దీనిపై సామ దామోదర్‌రెడ్డిని సంప్రదించగా.. మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో కొంత ఇబ్బంది ఉందని, కొంతకాలం ఆగమని చెప్పారు. మా ప్లాట్లు మాకు ఇప్పించండి.

– భూలోకం, ప్లాటు కొనుగోలు చేసిన వ్యక్తి

దౌర్జన్యం చేస్తున్నారు



2006లో కుటుంబ సభ్యులమంతా కలిసి ఎనిమిది ప్లాట్లు (4 వేల గజాలు) కొనుగోలు చేశాం. ప్రైవేటు వ్యక్తులు వచ్చి ఇప్పుడు దౌర్జన్యం చేస్తున్నారు. తమను విజయవాడ, ఇతర ప్రాంతాల్లో ఉన్నవారిని సైతం సంప్రదించి తక్కువ ధరకు ప్లాట్లు అమ్మేయాలని జీవన్‌రెడ్డి మనుషులు ఒత్తిడి తెచ్చారు. పోలీసులు, రెవెన్యూ అధికారులే మాకు న్యాయం చేయాలి.

– శ్యాం లంబ, ప్లాటు కొనుగోలు చేసిన వ్యక్తి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం, బీజేపీ నాయకులు

వర్సిటీ భూములను కాపాడుకుందాం

బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్

చేవెళ్ల: వర్సిటీ భూములను, పర్యావరణాన్ని, విద్యార్థుల హక్కులను కాపాడే దిశగా ఉద్యమం కొనసాగిస్తామని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్, చేవెళ్ల బీజేపీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డిలు అన్నారు. గురువారం మండలకేంద్రంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ పిలుపు మేరకు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిరంకుశ విధానాలు తిప్పి కొట్టేందుకు తమ నిరసనలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. హెచ్‌సీయూ భూములను లాక్కునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రక్రియను ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించాలని కోరుతూ ర్యాలీ చేపట్టి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, బి.చంద్రశేఖర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రాజమల్లేశ్, శివకుమార్, ప్రవీణ్, భాస్కర్, శ్రీనివాస్, మధూకర్‌రెడ్డి, శ్రీనివాస్, బి.కృష్ణ, నితీష్‌రెడ్డి, శివకుమార్‌గౌడ్, రిషికేశ్, రాజు, మైసూరారెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్, మహేశ్, సాయి, శ్రీరాములు, శ్యామ్, కిరణ్ పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

- తనిఖీలు చేపట్టిన బాంబు స్క్వాడ్
- అంతా ఉత్తిదేనని తేల్చిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్– మల్కాజిగిరి కలెక్టరేట్‌ను గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు పేల్చివేస్తామని ఓ ఆగంతకుడు జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు మెయిల్ పెట్టాడు. దీంతో ఈ విషయంపై విచారణ చేయాలని కలెక్టర్ గౌతమ్ రాచకొండ పోలీసు కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో డీసీపీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు మేడ్చల్ ఏసీపీ గురువారం మధ్యాహ్నం 3.45 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మేడ్చల్ కలెక్టరేట్‌లోని వివిధ శాఖల్లో బాంబు స్క్వాడుతో తనిఖీలు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి బాంబు జాడ లేకపోవటంతో.. ఉత్తుత్తి బెదిరింపులేనని పోలీసులు తేల్చారు. దీంతో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కాగా.. కలెక్టర్ గౌతమ్‌కు గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పంపించారు? అనే అంశంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు నేపథ్యంలో పోలీసుల సూచనల మేరకు వివిధ విభాగాల జిల్లా ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మధ్యాహ్నం 3 గంటలకు తమ కార్యాలయాల నుంచి బయటకు వెళ్లిపోయారు. బాంబు బెదిరింపు మెయిల్ మావోయిస్టు ముప్పాళ్ల లక్ష్మణరావు పేరిట రావటంతో



పాటు.. అందులో ముస్లిం సంస్థలకు సంబంధిన పేర్లతో సహా అన్నాడీఎంకే తదితర పార్టీలు, సంస్థల పేర్లు ఉండటంతో.. కావాలనే ఎవరో ఆగంతకుడు మెయిల్ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

చర్చోపచర్చలు..

మేడ్చల్ కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు మెయిల్ మెసేజ్‌పై ఉద్యోగులతో సహా ప్రజల్లో పలు రకాలుగా చర్చ సాగుతోంది. జిల్లాలో పలువురు ఉన్నత స్థాయి అధికారులు తమ సమస్యలు విన్నవించేందుకు వచ్చిన ప్రజలకు సమయం కేటాయించకపోవటం వల్లే.. విసుగెత్తిన వారు ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బాంబు బెదిరింపుపై తదుపరి విచారణ చేయాలని పోలీసులను ఆదేశించినట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ అంటేనే మోసం

- ముఖ్యమంత్రి పాలన సగం సగం.. అంతా ఆగమాగం
- అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సర్కార్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు
- బీఆర్‌ఎస్‌యే రాష్ట్రానికి శ్రీరామ రక్ష
- మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కాని హామీలు గుప్పించిందని.. మాయమాటలతో మభ్యపెట్టి గద్దెనెక్కిన సర్కార్ పాలనలో ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం ఆయన మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి మండల పరిధిలోని ముద్విన్, బోయిన్‌గుట్ట తండాలో పర్యటించారు. ముద్విన్‌లో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథనాయక్ ఆధ్వర్యంలో పేదింటి ఆడబిడ్డ షేడం యాదమ్మకు నిర్మించిన ఇంటిని ప్రారంభించి బోయిన్‌గుట్టతండాలో మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్, సంత్‌సేవాలాల్ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటనే మోసమని.. తాము అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి రూ.లక్షతో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, మహిళలకు ప్రతీ నెల రూ.2,500, రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని నమ్మించి మోసం చేశారన్నారు. రేవంత్‌రెడ్డి ఏడాదిన్నర పాలన సగం సగం.. అంత ఆగం ఆగంలా ఉందని ఎద్దేవా చేశారు. గతేడాది యాసంగి, వానాకాలం కలిపి రూ.13వేల కోట్ల రైతుబంధు ఎగ్గొట్టి రుణమాఫీ చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ జీడీపీ, రాష్ట్ర తలసరి ఆదాయం పెంచితే.. ప్రస్తుత ముఖ్యమంత్రి గుండాయిజం, కుటుంబ ఆదాయం పెంచుకుంటున్నారని ఆరోపించారు. ఫోర్త్ సిటీ ఎవరి కోసం.. పేదల భూములు లాక్కొని గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం ఎందుకోసమని ప్రశ్నించారు. పేదలకు పట్టాలిస్తామని చెప్పిన ప్రభుత్వం.. గద్దెనెక్కి భూములు గుంజుకుంటుందని మండిపడ్డారు. నెలకు రూ.4వేల ఫించన్ ఇస్తామని 16 నెలల పాలనలో రెండు నెలల ఫించన్లు ఎగ్గొటాడన్నారు. బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, కేసీఆర్ కిట్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అన్ని బంద్ అయ్యాయని వివరించారు. ప్రభుత్వం హెచ్‌సీ యూ వర్సిటీ భూములు అమ్ముకునేందుకు కుట్రపన్నుతోందన్నారు. నల్లమల బిడ్డనని, పాలమూరు బిడ్డనని చెప్పే సీఎం రేవంత్‌రెడ్డికి పౌరుషం ఉంటే పోలీసులు లేకుండా బోయిన్‌గుట్ట తండాకు వస్తే ప్రజలే సమాధానం చెబుతారని సవాల్ విసిరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ప్రతీ పేదవాడి అకౌంట్‌లో రూ.15లక్షలు వేస్తామని మోసం చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీయే తెలంగాణకు శ్రీరామ రక్ష అన్నారు.

రాష్ట్రంలో రక్షణ కరువు: సబితారెడ్డి

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. విదేశీ మహిళలపై దాడులు జరుగుతుంటే రక్షణ ఎక్కడ ఉందని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో



సంత్‌సేవాలాల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు, సబితారెడ్డి తదితరులు

మహిళపై జరిగిన దాడి అత్యంత దారుణమని, రాష్ట్రంలో మహిళలపై హింస పెరిగిపోయిందని, ప్రభుత్వం మహిళలపై జరుగుతున్న దాడులను నిరోధించడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్‌భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్, ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, ఎర్రోళ్ల శ్రీను, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, మార్కెట్ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, అంజినాయక్, నర్సింహగౌడ్ తదితరులు ఉన్నారు.

శోభాయాత్రకు భారీ బందోబస్తు

అబిడ్స్: శ్రీరామ నవమి శోభాయాత్రకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ నెల 6న సీతారామ్‌బాగ్ నుంచి హనుమాన్ టేక్డీ వరకు కొనసాగే శోభాయాత్రకు ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో అన్ని విధాలా ఏర్పాట్లు చేపడతామని వెల్లడించారు. గురువారం సీతారామ్‌బాగ్‌లోని ద్రౌపది గార్డెన్‌లో జరిగిన పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఆదివారం సీతారామ్‌బాగ్ ఆలయం నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్రను శాంతియుతంగా, సంతోషంగా చేపట్టాలని సూచించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు శోభాయాత్ర ప్రారంభించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. శోభాయాత్రలో డీజేలకు బదులుగా సౌండ్ బాక్సులు వాడుకోవాలని సీపీ పేర్కొన్నారు. సుమారు 20 వేల మంది పోలీసులతో శోభాయాత్రకు బందోబస్తుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డెవిస్, డీసీపీలు జి.చంద్రమోహన్, బి.బాలస్వామి, చైతన్య కుమార్, జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, వాటర్‌బోర్డు అధికారి అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి తెలంగాణ తొలి విత్తన పండుగ

ఏర్పాట్లను పరిశీలించిన నిర్వాహకులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సంస్థ నిర్వాహకులు

కడ్తాల్: అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ తొలి విత్తన పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం ఆమె సంస్థ ప్రతినిధులతో కలిసి ఎర్త్ సెంటర్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విత్తన పండుగకు దేశ నలుమూలల నుంచి రైతులు, నిపుణులు పాల్గొంటున్నారని చెప్పారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన 50 స్టాల్స్‌లో సంప్రదాయ విత్తనాల ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఆమె వెంట సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి, పాలసీ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, సంస్థ నిర్వాహకులు జేపీఎస్‌ఆర్ అన్నమయ్య, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

శభాష్.. బలరాం నాయక్



ప్రశంసా పత్రం అందుకుంటున్న బలరాం


కొడంగల్: ఆస్తి పన్ను వసూలులో చొరవ చూపిన కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్‌ను సీడీఎంఏ(కమిషనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) టీకే శ్రీదేవి అభినందించారు. గురువారం హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయంలో ప్రశంసా పత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను వసూలులో ముందున్నారని కొనియాడారు. మెరుగైన ప్రతిభ కనబరచి 83 శాతం ఆస్తి పన్ను వసూలు చేసినట్లు తెలిపారు. విధి నిర్వహణలో ఆయన చూపిన చొరవను అభినందిస్తూ ప్రశంసా పత్రం అందజేశారు.

అవినీతి జలగలపై విచారణ

అర్బన్ పార్కులో పర్యటించిన విజిలెన్స్ అధికారులు

బషీరాబాద్: తాండూరు అర్బన్ పార్కులో జరిగిన అక్రమాలపై అటవీశాఖ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. పార్కులో రూ.16 లక్షల నిధులతో చేపట్టిన వాకింగ్ పాత్ పనుల్లో బీట్ ఆఫీసర్ మల్లయ్య, సెక్షన్ అధికారి ఫీర్యా నాయక్ అవినీతికి పాల్పడినట్లు ఇటీవల ‘సాక్షి’ దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై చీఫ్ కన్జర్వేటర్ ప్రియాంక వర్గీస్ విచారణకు ఆదేశించారు. ఇప్పటికే వికారాబాద్ డీఎఫ్ఓ ప్రాథమిక విచారణ జరపగా, మార్చి 27వ తేదీ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వివరాలు సేకరించారు. గురువారం స్టేట్ ఫారెస్ట్ విజిలెన్స్ డీఎఫ్ ఓ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో మరోసారి విచారణ చేపట్టి.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారులనూ ప్రశ్నించినట్లు తెలిసింది. అనంతరం తాండూరు రేంజ్ కార్యాలయంలో రికార్డులను, బషీరాబాద్ మండలం గొట్టిగా కళాన్ గ్రామంలో అటవీ భూముల్లో జరిగిన తవ్వకాలను పరిశీలించారు.

వికారాబాద్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు



అనంతగిరి: జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నందున కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా సమస్య ఏర్పడితే 08416–242136 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ కేంద్రం ప్రారంభం

కొడంగల్: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో డీఆర్డీఓ శ్రీనివాస్ ప్రారంభించారు. కొడంగల్ నియోజకవర్గంలోని నిరుద్యోగులు అధిక సంఖ్యలో స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉషశ్రీ బాలకృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సుపారీ ఇచ్చే నా భర్తను చంపారు


మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి

- దాయాదులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి ఆందోళన
- డీసీపీ హామీతో సద్దుమణిగిన వ్యవహారం

మహేశ్వరం: భూ తగాదా వ్యవహారంలోనే తన భర్తను కారుతో ఢీకొట్టి హత మార్చారని మండలంలోని కల్వకోల్‌కు చెందిన కమల ఆరోపించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం పిల్లలు, బంధువులతో కలిసి ఆమె మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. కల్వకోల్ గ్రామానికి చెందిన గూడెపు శంకరయ్య(52) కారు–బైక్ ఢీకొన్న ప్రమాదంలో బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే.

అన్ని కోణాల్లో విచారిస్తాం

మృతుడి భార్య కమల మాట్లాడుతూ.. తన భర్తను డ్రైవర్ ప్రశాంత్‌కి సుపారీ ఇచ్చి కారుతో వెనుక నుంచి ఢీకొట్టి దాయాదులు చంపారని ఆరోపించారు. భూ తగాదా విషయంలో కోర్టులో తీర్పు తమకే అనుకూలంగా వస్తుందని తెలియడంతో దాయాదులు హత్యకు పూనుకున్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోలీస్‌స్టేషన్ నుంచి కదిలేది లేదన్నారు. విచారణ చేస్తున్న ఎస్‌ఐ వెంకట్‌రెడ్డిని మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘటనా స్థలానికి మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి చేరుకొని మృతుడి భార్య, పిల్లలు, బంధువులతో మాట్లాడారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకొని అన్ని కోణాల్లో విచారించి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు

ఎయిర్ ఫిస్టల్‌తో బెదిరింపులు

బంజారాహిల్స్: మెడికల్ సీటు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని సీటు ఇప్పించకపోగా డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు ఎయిర్ ఫిస్టల్‌తో బెదిరించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..స్వర్ణధామ నగర్‌కు చెందిన ఎస్‌వీ నాగిరెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. తన కుమార్తె పీజీ మెడికల్ సీటు కోసం చక్రధర్‌రెడ్డి అనే వ్యక్తిని సంప్రదించిన అతను రూ.20 లక్షలు ఇచ్చాడు. అయితే చక్రధర్‌రెడ్డి సీటు ఇప్పించకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని నాగిరెడ్డి ఒత్తిడి చేయడంతో రూ.5 లక్షలు తిరిగి ఇచ్చాడు. మిగతా డబ్బులు ఇవ్వాలని ఇవ్వాలని కోరగా డబ్బులు అడిగితే నీ అంతు చూస్తానంటూ ఎయిర్ ఫిస్టల్‌తో బెదిరించాడు. తనతో పాటు కుటుంబ సభ్యులకు చక్రధర్‌రెడ్డి నుంచి ప్రాణహాని ఉందని బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సాక్షి,సిటీ బ్యూరో: నగరంలో కురుస్తున్న అకాల వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు.గురువారం సాయంత్రం భారీ వర్షాల నేపథ్యంలో మేయర్ జోనల్ కమిషనర్ల తో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారు. ఇంజనీరింగ్ ఐఆర్‌టీ వాహనాలను రంగంలోకి దింపినట్లు తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటికి రావాలని, రోడ్డుపై నిలిచిన నీటిలో చిన్న పిల్లలు, వృద్ధులు వెళ్లకూడదని, మ్యాన్ హోల్స్ తెరవ వద్దని మేయర్ సూచించారు. అత్యవసరమైతే జీహెచ్‌ఎంసీ కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలన్నారు.

నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్

డీసీపీ పద్మజారెడ్డి

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధి వికలాంగుల కాలనీలో రాచకొండ సీపీ సుధీర్ బాబు ఆదేశాల మేరకు మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి ఆధ్వర్యంలో 120 మంది పోలీసులతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 24 బ్లాకుల్లో 200 ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ పద్మజారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు శాంతియుత వాతావరణం కల్పించడం కోసం పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారన్నారు. నేరాల నియంత్రణ కోసం కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. జవహర్‌నగర్‌లో గంజాయి విక్రయించినా, సేవించినా పోలీసులకు సమాచారం అందించాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టరిత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సెర్చ్‌లో 202 వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా అమ్ముతున్న 17 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుషాయిగూడ ఏసీపీ మహేష్, జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, అడ్మిన్ ఎస్సై ఇద్రీస్‌అలీ, రామునాయక్, లక్ష్మయ్య, వేణు, పోలీసులు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్

- కడ్తాల్‌లో హరీశ్‌రావుకు ఘన స్వాగతం
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు


పార్టీ జెండావిష్కరణలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి

కడ్తాల్: భారత్ రాష్ట్ర సమితి పార్టీ శ్రేణుల్లో జోష్ వచ్చింది. మండలంలో గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిల పర్యటన పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. హరీశ్‌రావు రాకను పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తదితరుల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, గిరిజన మహిళలు తరలివచ్చి ఘన స్వాగతం పలికారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి

పర్యటనలో భాగంగా హరీశ్‌రావు మండల కేంద్రంలో సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిలో నాయకులతో కలిసి పాల్గొని నివాళులర్పించారు. అనంతరం ఎక్వాయిపల్లి సమీపంలోని అర్జున్‌రావు ఫాం హౌస్‌లో కాసేపు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ బలోపేతం, స్థానిక ఎన్నికలల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

పార్టీ జెండావిష్కరణ

అనంతరం ఎక్వాయిపల్లి, మక్త్రిపల్లి, ముద్వీన్‌లో గ్రామంలో పార్టీ నాయకుల సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముద్వీన్ గ్రామంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలు వెచ్చించి షేడం యాదమ్మకు నిర్మించిన ఇంటిని నాయకులతో కలిసి హరీశ్‌రావు ప్రారంభించారు. మాజీ మంత్రి పర్యటన ఆద్యంతం సందడిగా సాగింది. ఎటు చూసిన గులాబి జెండాలతో నిండిపోయింది. బోయిన్‌గుట్ట బహిరంగ సభలో హరీశ్‌రావు ప్రసంగం కార్యకర్తలు, నాయకుల్లో జోష్ నింపింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్,మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌యాదవ్, జైపాల్‌నాయక్,మాజీ సర్పంచ్‌లుయాదయ్య, నర్సింహగౌడ్, లచ్చిరామ్‌నాయక్ ,పత్యానాయక్, రామకృష్ణ, మహేశ్,అంజ్యానాయక్, విజయ్‌గౌడ్, వీరయ్య, నరేశ్ తదితరులు ఉన్నారు.


దొడ్డి కొమురయ్య జయంతిలో నాయకులు


హరీశ్‌రావుకు తిలకం పెడుతున్న గిరిజన మహిళ

పిడుగుపాటుకు రైతు అస్వస్థత

గేదె దుర్మరణం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు

శంకర్‌పల్లి: అకాల వర్షాల కారణంగా పలుచోట్ల గురువారం పిడుగుపాటు పడ్డాయి. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురంకి చెందిన రైతు యాభైగూడెం నర్సింహారెడ్డి గేదెలు మేపుతుండగా.. వర్షానికి చెట్టు కిందకి వెళ్లాడు. తన రెండు గేదెలు పక్కనే ఉన్న మరొక చెట్టు కింద ఉన్నాయి. ఒక్కసారిగా పిడుగుపాటు పడడంతో ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందింది. మరొక గేదెకి, రైతు నర్సింహారెడ్డి అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు రైతుని పట్టణంలోని ఆసుపత్రిలో చేర్పించారు. కాసేపటికి ఆరోగ్య పరిస్థితి మెరుగయింది. గేదెని పశువైద్యులకు చూపించగా.. ప్రస్తుతం నిలకడ ఉన్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని 18 మేకల మృతి


మేకల కళేబరాలు

షాద్‌నగర్: రైలు ఢీకొని మేకలు మృతి చెందిన ఘటన గురువారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గడ్డం కృష్ణయ్య యాదవ్‌కు చెందిన మేకలను మేత మేసేందుకు రైల్వే ట్రాక్ పక్కకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ నుంచి కాచిగూడ వెళ్లే రైలు వచ్చింది. ఆ శబ్దానికి అవి ఒక్కసారిగా భయపడి పట్టాల పైకి పరుగులు తీశాయి. దీంతో రైలు ఢీకొని 18 మేకలు మృతి చెందాయి. దాదాపు రూ.మూడు లక్షల నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

కారు ఢీకొని జింక మృతి


జింక కళేబరం

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై గునుగల్ అటవీ ప్రాంతం వద్ద కారు ఢీకొని జింక మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీశైలం గురువారం ఉదయం తన కారులో సాగర్ రోడ్డు నుంచి నగరానికి వెళ్తున్నాడు. మార్గ మధ్యలో గునుగల్ అటవీ ప్రాంతంలో రోడ్డు దాటుతున్న జింక కారుకు అడ్డంగా వచ్చింది. దీంతో ఢీకొనడంతో జింకకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. దానికి అటవీ అధికారులు దహనం చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమష్టి కృషితోనే సత్ఫలితాలు

జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్ లక్ష్యంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్ రెండో విడత విజయవంతంగా పూర్తయిందని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ అందరి సమష్టి కృషితో సత్ఫలితాలు ఇచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో ఇంతకు మించి కష్టపడతామని వెల్లడించారు. ఇదే స్ఫూర్తి తో జున్ నాటికి మిగతా మాన్ హోళ్లను కూడా డీ సిల్టింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. వర్షాకాలంలోగా సీవరేజ్ పైపులైన్లు, మ్యాన్ హోళ్లలో వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. అక్టోబర్ 2 నుంచి మార్చి 30 వరకు 180 రోజులు డీ సిల్టింగ్ పనులు చేపట్టారు. ఫలితంగా ఇప్పటి వరకు 24,146 ప్రాంతాల్లో 3,185 కిలో మీటర్ల సీవరేజ్ పైపులైన్, 2.50 లక్షల మ్యాన్ హోళ్లలో డీ–సిల్టింగ్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. స్పెషల్ డ్రైవ్ పకడ్బందీగా అమలు చేసేందుకు గత మూడేళ్లలో వచ్చిన సీవరేజ్ ఫిర్యాదులను విశ్లేషించినట్లు చెప్పారు. ప్రధానంగా వినియోగదారుల ఇళ్లల్లో చోకేజీ, రోడ్లపై సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్యలను గుర్తించామని, రోజూ వచ్చే ఫిర్యాదుల్లో 60 శాతం ఇవే రావడంతో వాటిపై దృష్టి సారించి పరిష్కరించినట్లు ఆయన వివరించారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

బంజారాహిల్స్: డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–11 తాడిపత్రి బిర్యానీ సెంటర్ సెంటర్ వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు బైక్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్న వెస్ట్‌గోదావరి జిల్లా, భీమవరానికి చెందిన కోపర్తి సాయి మణికంఠ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని తనిఖీ చేయగా 07 గ్రాముల కొకైన్, 3.7 గ్రాముల ఎక్‌టసీ పిల్స్ లభించాయి. ఓ పెడ్లర్ నుంచి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. పోలీసులు అతడి వద్ద నుంచి మత్తు పదార్థాలు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బాలుడి దారుణ హత్య


రహీం(ఫైల్)

అత్తాపూర్: గంజాయి మత్తులో జరిగిన ఘర్షణలో ఓ బాలుడిని బండరాళ్లతో మోది హత్య చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు కథనంమేరకు వివరాలిలా ఉన్నాయి. గోల్డెన్ సిటీ హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన రఫిక్ కుమారుడు రహీం(14) ఆవారాగా తిరుగుతున్నాడు. గంజాయికి అలవాటు పడిన అతను ఇతరులతో గొడవ పడుతూ ఉండేవాడు. గురువారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన రహీంకు అతని స్నేహితులతో జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ఓ బాలుడు అతడి తలపై బండరాయితో మోది హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుడి తండ్రి రఫిక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా

హోంగార్డుపై కేసు నమోదు

పంజగుట్ట: ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేసిన హోంగార్డుపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పల్, ప్రతాప్ సింగారం ప్రాంతానికి చెందిన సునీల్ గౌడ్‌కు తన స్నేహితుల ద్వారా చంద్రప్రకాష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. చంద్రప్రకాష్ ఒక పోలీస్ ఉన్నతాధికారి వద్ద డ్రైవర్‌గా పని చేసేవాడు. 2024లో సునీల్ తన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నానని, గ్రూప్ ఫోర్ ఉద్యోగానికి పరీక్ష రాసిందని చంద్రప్రకాష్‌కు చెప్పాడు. దీంతో చంద్రప్రకాష్ తాను ఉన్నతాధికారులతో మాట్లాడి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. ఇందుకు రూ.6 లక్షలు ఖర్చవుతుందని చెప్పి రూ. 3 లక్షలు తన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. మరో రూ.3 లక్షలకు చెక్కులు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోకపోగా ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సునీల్ పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సిగరెట్లు అమ్మడం లేదన్నందుకు


గాయపడిన బాధితులు

హోటల్ నిర్వాహకులపై దాడి

మేడ్చల్‌రూరల్: సిగరెట్లు అమ్మడం లేదని చెప్పినందుకు హోటల్‌లో పని చేసే వ్యక్తితో పాటు యజమాని, అతడి కుమారుడు, కుమార్తెపై దాడి చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక వినాయక్‌నగర్ కాలనీకి చెందిన రాజేశ్ చతుర్వేది సోమారం గ్రామ పరిధిలోని రిలాన్స్ గోదాం సమీపంలో హోటల్ నిర్వహిస్తున్నాడు. సదరు హోటల్‌లో దివాకర్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. గత నెల 30న రాత్రి సమీపంలోని బండమైలారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు హోటల్‌కు వచ్చి సిగరేట్లు కావాలని అడిగారు. సిగరేట్లు అమ్మడం లేదని దివాకర్ చెప్పడంతో ఆగ్రహానికి లోనైన వారు అతడిపై దాడి చేశారు. దీనిపై అతను యజమాని రాజేశ్ చతుర్వేదికి సమాచారం అందించడంతో అతను తన కుమార్తె శివానీ, కుమారుడు కృష్ణతో కలిసి హోటల్ వద్దకు వచ్చి వారికి సర్దిచెప్పి పంపించారు. ఆ తర్వాత కొద్ది సేపటికే అక్కడికి వచ్చిన 20 మంది యువకులు కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో రాజేశ్ చతుర్వేదితో పాటు అతడి కుమార్తె, కుమారుడికి గాయాలయ్యాయి. అడ్డుగా వచ్చిన రాకేశ్ చతుర్వేది అనే వ్యక్తిపై కూడా వారు దాడి చేశారు. ఈ విషయం ఎవరికైనా చెపితే చంపుతానని బెదిరించారు. ఈ విషయమై బాధితులు మర్నాడు మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లీజు ముగిసినా క్వారీని వదలట్లేదు

- హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదులు
- గాజులరామారంలో పర్యటించిన రంగనాథ్
- మరో మూడు ప్రాంతాలకు వెళ్లి పరిశీలనలు



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ జిల్లా గాజులరామారంలోని క్వారీపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో క్వారీ లీజు గడువు ముగిసినా యజమానులు అక్కడ నుంచి ఖాళీ చేయకుండా స్థలం కబ్జాకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆరా తీసేందుకు వెళ్లిన రంగనాథ్ సమీపంలోని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ భూముల కబ్జాలను పరిశీలించారు. ఆ ప్రాంతంలో దాదాపు 400ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని కబ్జా కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలో 78 ఎకరాలను లీజుకు తీసుకున్న వారితో హైడ్రా కమిషనర్ వచ్చే వారం కీలక సమావేశం నిర్వహించనున్నారు. గాజులరామారం నుంచి శేరిలింగంపల్లి వెళ్లిన ఆయన నల్లగండ్ల చెరువు నాలాను పరిశీలించారు. నాలా విస్తీర్ణం తగ్గకుండా చూడాలని, అక్కడ పోసిన మట్టిని తొలగించాలని వెర్టెక్స్ నిర్మాణ సంస్థను ఆదేశించారు. ఈ సందర్భంగా నాలాతో పాటు బఫర్ జోన్‌కూ ఆటంకం లేకుండా నిర్మాణాలు చేయపడతామని నిర్మాణ సంస్థ హామీ ఇచ్చింది. గోపన్నపల్లి, పుప్పాలగూడలకు వెళ్లిన కమిషనర్ మేల్లకుంట, మామాసానికుంటలను పరిశీలించారు. సర్వే నంబర్ల ప్రకారం చెరువుల హద్దులపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో సమీక్షించారు.

బలహీనత ఖరీదు రూ.1.57 లక్షలు!

- ఆన్‌లైన్‌లో ఎస్కార్ట్ సర్వీస్ ప్రకటనలు
- ఆకర్షితుడైన నగరానికి చెందిన యువకుడు
- రిఫండ్ అంటూ ఎర వేసి ఆ మొత్తం స్వాహా
- సీసీఎస్‌లో కేసు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ యువకుడి చిన్న బలహీతన రూ.1.57 లక్షలు నష్టపోవడానికి కారణమైంది. ఆన్‌లైన్‌లో కనిపించిన ఎస్కార్ట్ సర్వీస్ ప్రకటనకు ఆకర్షితుడైన సదరు యువకుడు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న యువకుడిని నిర్ణీత మొత్తం చెల్లిస్తే ఏకాంత సేవలు అందిస్తాం అంటూ ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రకటన ఆకర్షించింది. అందులో ఉన్న ఫోన్ నెంబర్‌లో సంప్రదించగా... ఈ సేవల కోసం రూ.4 వేలు చెల్లించాలని అవతలి వారు చెప్పారు. తొలుత తమకు రూ.500 చెల్లించాలని, ఆపై తాము సేవలు అందించే యువతితో పాటు చేరుకోవాల్సిన హోటల్ వివరాలు అందిస్తామన్నారు. అక్కడకు వెళ్లిన తర్వాత మిగిలిన మొత్తం ఇవ్వాలని సూచించారు. దీంతో సదరు యువకుడు వారు సూచించిన ఖాతాకు రూ.500 చెల్లించాడు. ఆపై ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు మిగిలిన మొత్తం కూడా బదిలీ చేయించుకున్నారు. అంతటితో ఆగకుండా యువకుడి నుంచి వీలున్నంత ఎక్కువ గుంజాలని పథకం వేశారు. దీనిని అమలులో పెడుతూ సెక్యూరిటీ డిపాజిట్, ఐడీ వెరిఫికేషన్ పేమెంట్, పోలీస్ వెరిఫికేషన్ అండ్ సేఫ్టీ పేమెంట్ పేరుతో డబ్బు వసూలు చేశారు. అతడికి అనుమానం వచ్చిన ప్రతిసారీ రూ.4 వేలు మినహా మిగిలింది రిఫండ్ అవుతుందని నమ్మించారు. ఓ దశలో రెండు నిమిషాల్లో రిఫండ్ మొత్తం వస్తుందంటూ మరికొంత, వేగంగా రిఫండ్ కావాలంటే తప్పదంటూ రెట్టింపు మొత్తం బదిలీ చేయించుకున్నారు. ఇలా మొత్తం రూ.1,57,381 బదిలీ చేయించుకున్న తర్వాత 'ప్రాసెస్ పూర్తయింది. నగదు రిఫండ్ చేయడానికి మీ బ్యాంకు ఖాతా వివరాలు పంపండి. మీ బుకింగ్ ఐడీ, హోటల్ పేరు, రూమ్ నెంబర్ తదితరాలు లోకంటో.కామ్ అనే వెబ్‌సైట్‌లో పొందుపరుస్తాం' అనే సందేశాన్ని యువకుడికి పంపారు. దీంతో అనుమానించిన అతగాడు ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేసి తాను మోసపోయినట్లు గుర్తించాడు. సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.